నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నల్లగొండ

బుధవారం 13 డిసెంబర్ 2023
WEDNESDAY, DECEMBER 13, 2023

NALGONDA

పేజీలు : 8
PAGES




సూర్యాపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

తొమ్మిదిన్నరేండ్లలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

అందుబాటులోకి పుష్కలంగా సాగునీటి వనరులు.. 24 గంటల విద్యుత్

నాడు కరువు నేలలో నేడు సిరుల పంటలు

ఉమ్మడి జిల్లాలో 13.54లక్షల ఎకరాలకు పెరిగిన వరి సాగు

33.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి

వలస జిల్లాకే వలసొచ్చేలా గణనీయమైన వృద్ధి

# ధాన్యం ఉత్పత్తిలో మనమే టాప్



## రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా

సమైక్య పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కరువు ప్రాంతంగా ముద్ర పడింది. వనరులు ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో వెనుక బాటుకు గురైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నాగార్జునసాగర్ ఆయకట్టుకు కృష్ణాజలాల్లో నిక్కచ్చిగా నీటి వాటాను వినియోగిస్తూ రెండు పంటలకు సాగునీరు అందించడం మొదలైంది. మిషన్ కాకతీయతో చిన్ననీటి వనరులను పటిష్ట పర్చడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చాయి. వీటికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వచ్చాయి. రైతు బంధు పథకం ద్వారా పంట పెట్టుబడి సాయం అందింది. 24 గంటల కరెంట్ సరఫరాతో ఏటికేడు సాగు విస్తీర్ణం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 2014 వానకాలంలో వరిసాగు 4.44లక్షల ఎకరాల్లో ఉండగా ఈ ఏడాది వానకాలం 13.54లక్షల ఎకరాలకు చేరింది. నాడు 12.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా, ప్రస్తుతం 33.85లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రంలోనే ఉమ్మడి నల్లగొండ ధాన్యాగారంగా మారింది. ఫలితంగా పల్లెల్లో ఆర్థిక వనరులు పెరిగాయి.

*– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)*

మధ్య పేజీల్లో..




# అధికారంలో ఉన్నా..లేకున్నా జనం మధ్యే ఉంటా

2లో..

ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్‌లో లేదు

అసెంబ్లీకి పోకున్నా ఏదో చేస్తానని ఆ పార్టీ నాయకుడు అంటున్నాడు

ప్రజల నుంచి ప్రశ్న వచ్చే వరకు ఓపికతో ఉందాం

విద్యుత్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టి ఉన్నది ఉన్నట్లు చెప్పేందుకు సిద్ధం

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

అధికారంలో ఉన్నా, లేకున్నా ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కొంత సమయం ఇచ్చి ప్రజల నుంచి ఆ ప్రభుత్వంపై ప్రశ్నలు వచ్చే వరకు ఓపికతో ఉందామని సూచించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హామీలన్నీ అమలు చేశామని, ఎన్నో మంచి పనులు చేశామని చెప్పారు. ఎన్నికల్లో ప్రతిపక్షాలకు చెప్పేందుకు ఏమీ లేక పదేండ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందన్న వాదనను తీసుకొచ్చి తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇవ్వలేక తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖలో అప్పులు పేరుకుపోయాయని సాకు చూపెడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో అసెంబ్లీలో తాను చర్చ పెట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను గుర్తించి తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు.

*– బొడ్రాయిబజార్, డిసెంబర్ 12*

# పక్కాగా 'పది' ప్రణాళిక

5లో..

టెన్త్‌లో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు

నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసేలా కార్యాచరణ

ప్రతిరోజూ స్పెషల్ క్లాసులు

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ చేపడుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే స్కూళ్లలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్ఏ -1లో వచ్చిన మార్కుల ఆధారంగా వారికి పాఠ్యాంశాల్లో మెళకువలు చెప్తున్నారు. జనవరి నుంచి పాఠాలను పునఃశ్చరణ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు.

*– సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 12*



ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

## ఈ సారికి అవే ₹5వేలు

పాత పద్ధతిలోనే రైతు బంధు

యాసంగి పెట్టుబడి సాయం పంపిణీ షురూ

రైతుల ఖాతాల్లో జమకు ప్రభుత్వం నిర్ణయం

తక్కువ భూమి గల రైతుల నుంచి మొదలు

వచ్చే వానకాలం నుంచి అదనపు పెంపు?

2లో..